

ఇష్టారాజ్యం

- ఇటీవలే అధికారుల దాడులు
- 16 మెడికల్ దుకాణాలకు నోటీసులు జారీ
- కాలపరిమితి దాటిన మందులు ఇవ్వడంతో ఓ మెడికల్ దుకాణం సీజ్



గద్వాల జిల్లాలోని ఓ మెడికల్ దుకాణంలో మందులను పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ వినయ్(ఫైల్)

● గద్వాల జిల్లాలో యాంటీబయాటిక్ విక్రయాలు

గద్వాల క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో గత కొంతకాలంగా ఇష్టానుసారంగా యాంటీబయాటిక్ మందుల విక్రయాలు తారస్థాయికి చేరాయి. గతంలో ఉన్న అధికారులు చుట్టపుచూపుగా కూడా గద్వాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో మెడికల్ ఏజేన్సీలు, మెడికల్ దుకాణాల ఆగడాలు తారాస్థాయికి చేరాయి.

గతంలో అధికారులు లేకపోవడంతో అధికారి కార్యాలయంలో తాత్కాలికంగా పనిచేసే ఓ ఉద్యోగే కీలక పాత్ర పోషించడం, ఏ జెన్సీల నుంచి, మెడికల్ దుకాణాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

● జిల్లాలో ముమ్మర దాడులు...

జోగుళాంబ గద్వాల జిల్లాలో గత కొన్ని ఏళ్లుగా పట్టించుకోని అధికారులు రెండు నెలల క్రితం బాధ్యతలు చేపట్టిన డ్రగ్ ఇన్ స్పెక్టర్ మెడికల్ ఏజేన్సీలు, మెడికల్ దుకాణాలపై దాడులు చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అయితే జిల్లాలో మొత్తం 430 మెడికల్ దుకాణాలు, 40 మెడికల్ ఏజెన్సీలు ఉండగా, ఆయన వచ్చిన రెండు నెలల్లోనే ఇప్పటివరకు 46 మెడికల్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. 16 మెడికల్ దుకాణాలపై 5 నుంచి 8 రోజుల పాటు సస్పెన్షన్ ఆర్డర్‌లు జారీ చేశారు. అంతేకాకుండా జిల్లా కేంద్రంలోని ఓ మెడికల్ దుకాణంలో కాలం చెల్లిన మందులు ఇచ్చినందుకు సీజ్ చేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

మెడికల్ దుకాణాల్లో ఫార్మాసిస్ట్ లేకుంటే చర్యలు

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇకపై నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ దుకాణాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని సంబంధిత అధికారి హెచ్చరించారు. ఇందులో ముఖ్యంగా మెడికల్ దుకాణాల్లో ఫార్మాసిస్ట్ తప్పనిసరిగా ఉం డాలి. అలాగే ఈ కింద వివరించిన అంశాలు తప్పనిసరి పాటించాలి.

- ● ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయించరాదు
- ● యాంటీబయాటిక్ మందులివ్వకూడదు
- ● మెడికల్ దుకాణాలను ఆర్ఎంపీలు నిర్వహించరాదు
- ● ఉన్న మందులను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పొందుపరిచేలా చూడాలి

● జమ్మిచేడులో మారని పరిస్థితి



గద్వాల జిల్లా కేంద్రంలోని జమ్మిచేడులో గతంలో ఓ ఆర్ఎంపీ లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తుండటంతో హెచ్చరికలు జారీ చేసి, కేసులు కూడా నమోదు చేసినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ వినయ్ తెలిపారు. అయితే గతంలో ఉన్న అధికారులు హెచ్చరించినా వినకుండా మళ్లీ అదే తంతు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు రావడంతో అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు ఆయన తెలిపారు. అయితే ఎన్నిసార్లు హెచ్చరించినా ఫలితం లేకపోవడంతో నేడో, రేపో మళ్లీ అతనిపై చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా సంబంధిత వ్యక్తి తాను ఆత్మహత్య చేసుకుంటానని సంబంధిత అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఈ విషయంపై సంబంధిత అధికారులకు, పోలీసులకు సమాచారం అందించనున్నట్లు ఆయన తెలిపారు.

అన్నా.. నన్నెందుకు చంపుతున్నారు?

- హత్య సమయంలో తేజేశ్వర్ చివరి మాటలకు లొంగని కసాయిలు
- డ్రైవర్ సీటులో ఉన్న వ్యక్తే గొంతుకోసి చంపాడు
- వాయిస్ చేంజర్ డివైజ్‌తోనే బాధిత కుటుంబ సభ్యులను మోసగించిన వైనం
- విలేకరులకు వెల్లడించిన ఇన్వెస్టిగేషన్ అధికారి శ్రీను

6



తేజేశ్వర్ హత్యలో కీలక పాత్ర పోషించిన వాయిస్ చేంజర్

నల్లమలలో కొనసాగిన పర్యాటకుల రద్దీ

- చెక్‌పోస్టుల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

6



మన్ననూరు టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ ఇలా...

ఆలోచనలకు ప్రతిబింబం కవితా వ్యాసంగం

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

6



చైర్మన్‌కు సమస్యలను వివరిస్తున్న పాఠకులు

మా బతుకులు ఈ భూమి పైనే

- అటవీ శాఖ అధికారులతో చెంచుల వాగ్వాదం

7

సాయం చేయడం అభినందనీయం

- చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత
- ఆత్మీయ సమ్మేళనంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

7

రాజ్యాంగంపై బీజేపీకి నమ్మకం లేదు

- మాజీ ఎంపీ సుభాషిణి అలీ
- గద్వాలలో ఆవాజ్ కమిటీ ర్యాలీ

7

ఇట్లుంటే.. చదువు సాగేదెట్లా..



ఒకే గదిలో 6, 7 తరగతి విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న టీచర్(ఫైల్)

- పిల్లలున్న బడుల్లో ఉపాధ్యాయులు లేరు
- టీచర్లు లేరని పిల్లలను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు
- ఖాళీలను భర్తీ చేయడంలో అధికారుల నిర్లక్ష్యం
- ఇబ్బంది పడుతూనే విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తకోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సర్కారు పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపణలు లేకపోలేదు. ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించి పిల్లలను బడికి రప్పించుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నట్లుగానే పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించడం లేదు. ఇట్లయితే పిల్లల చదువులు సాగేదెట్లా అని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు తగ్గట్లుగా టీచర్లు ఏరీ?

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా చాలా పాఠశాలల్లో టీచర్లు లేరని తెలుస్తున్నది. ఉదాహరణకు కొత్తకోట మండలాన్ని తీసుకున్నట్లయితే ముమ్మళ్లపల్లి గ్రామంలో యూపీఎస్ పాఠశాల ఉండగా 83 మంది విద్యార్థులు బడికి వస్తున్నారు. వీరికి ఒక ఎస్ఏ టీచరు, ఇద్దరు ఎస్జీటీ ఉపాధ్యాయులు విద్యాభ్యాసన చేస్తున్నారు. 1, 2, 3 తరగతులకు చెందిన 29 మంది విద్యార్థులను ఒక తరగతి గదిలో కుర్చోబెట్టి విద్యాభ్యాసన చేయిస్తున్నారు. 4, 5 తరగతులకు సంబంధించి 21 మంది విద్యార్థులను ఒకే గదిలో ఉంచి పాఠ్యాంశాలు బోధిస్తున్నారు.

అలాగే 6, 7 తరగతులకు చెందిన 33 మంది విద్యార్థులను మరో గదిలో కుర్చోబెట్టి విద్యాబోధన చేస్తున్నారు. కనిమెట్ట యూపీఎస్‌లో 123 మంది విద్యార్థుల సంఖ్య ఉండగా ఏడుగురు ఉపాధ్యాయులకుగాను ఇద్దరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే, పాలెం దళితవాడ పాఠశాలలో 48 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు ఉపాధ్యాయులకు ఒక్కరే ఉన్నారు.

కొత్తకోట రాఘవేంద్ర కాలనీ పీఎస్ పాఠశాలలో 110 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు టీచర్లే బోధన చేస్తున్నారు. ముమ్మళ్లపల్లి యూపీఎస్‌లో 6, 7వ తరగతికి చెందిన ఐదుగురు విద్యార్థులను తల్లిదండ్రులు ఉపాధ్యాయులు లేరని తీసుకెళ్లారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి యూపీఎస్‌కు మరొక ఎస్ఏ టీచరు, పీఎస్‌లకు విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



వారంలోగా సర్దుబాటు చేస్తాం

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించడానికి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ జరుగుతుంది. వారం రోజుల్లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లుగా ఉపాధ్యాయులను నియమించే అవకాశం ఉంది.

\- కృష్ణయ్య, ఎంఈవో, కొత్తకోట మండలం

మాటలు కాదు.. చేతల ప్రభుత్వం

- మంత్రి వాకిటి శ్రీహరి



అమరచింతలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

అమరచింత, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గత పది సంవత్సరాలు పాలించిన ప్రభుత్వం మాదిరిగా మాటలతో కూడుకున్నది కాదని.. మాది చేతల ప్రభుత్వం అని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం ఉదయం అమరచింత ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో స్టేట్ మ్యాచింగ్ గ్రాండ్స్ ద్వారా 20లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులు, సింగంపేట గ్రామంలో 12లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను రాష్ట్ర కాంగ్రెస్ కల్లుగీత కార్మిక విభాగం చైర్మన్ కేశం నాగరాజుగౌడ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు చేస్తూ ముందుకు వెళ్తున్నదని ఆయన అన్నారు. మాటలు చెబుతూ కాలం గడిపేవాళ్లం కాదని.. మాట ఇచ్చిన ప్రకారం పని చేసే ప్రభుత్వమని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ పాఠశాలలను సైతం బలోపేతం చేయడానికి పూర్తిగా కృషి చేస్తున్నారని అన్నారు. పాఠశాలలు తెరిచిన వెంటనే ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు మొదటి రోజే అందించిన ఘనత తమదేనని అన్నారు. నాగరాజుగౌడ్, రెవెన్యూ, మండల పరిషత్, విద్యాశాఖ, ఈజీఎస్ పంచాయతీరాజ్ అధికారులతోపాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



క్లిక్.. క్లిక్..

పంట సాగులో రైతు.. ఆహారం వేటలో కొంగలు..

పంట సాగులో రైతు.. ఆహారం వేటలో కొంగలు పడుతున్న ఆరాటం దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది. ఆత్మకూరు మండల పరిధిలోని మూలమల్ల గ్రామ పరిధిలో రైతు వరి సాగు కొరకు పొలాన్ని చదును చేసుకుంటున్నాడు. ఈ సమయంలో పొలంలోని క్రిమికీటకాలను ఆరగించి పొట్టనింపుకుందామని కొంగలు పరితపించాయి. ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకున్నది.

\- ఆత్మకూరు, ఆంధ్రజ్యోతి



నిర్వాసితులకు అండగా ఉంటాం

- నిర్వాసితుల సమావేశంలో బీజేపీ నాయకులు



సమావేశంలో పాల్గొన్న శ్రీశైలం ముంపు నిర్వాసితులు

అలంపూరుచౌరస్తా, జూలై 13 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ముంపు నిర్వాసితులకు అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర నాయకులు. ధారా సింగ్, కె. దాగోజీరావు అన్నారు. ఈ సందర్భంగా వారు ఆదివారం అలంపూరు చౌరస్తాలో వనపర్తి, కొల్లాపూర్, అలంపూరు ప్రాంతాల నిర్వాసితుల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా నిర్వాసితులకు న్యాయం జరగకపోవడం బాధాకరమని వారన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగే విషయంలో బీజేపీ అండగా ఉంటుందన్నారు. కోర్టుల విషయంలోనూ ఆదుకుంటామన్నారు. దాగోజీరావు మాట్లాడుతూ ఉద్యోగాలు రావాలంటే ఉద్యమించాలని అన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. మనకు న్యాయం జరగాలంటే న్యాయస్థానాలకే ముందుకురావాలని గోవింద్ అన్నారు. సుమారు వందమంది నిర్వాసితులు, నాయకులు రంగస్వామి, వెంకటేశ్వర్లు, కృష్ణ, దామోదర విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.



ఆర్టీసీ కాలనీకి భూమి పూజ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సంతోష్‌కుమార్

కల్వకుర్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తాండ్రా సమీపంలో ఆర్టీసీ ఉద్యోగులకు ఆర్టీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేశారు. అనంతరం కార్మిక సంఘం నాయకులు ధార సుందర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్టీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ మహమ్మద్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులకు సొంతింటి కల నెరవేరుస్తున్నందుకు అభినందనీయమని ఆర్ఎం సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుభాషిణి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శంకర్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్.శ్రీనివాస్‌యాదవ్, ఆర్టీసీ నాయకులు ఇబ్రహీం, మల్లేశం, సాయిబాబు, సాయిరెడ్డి, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

విశ్రాంతి భవనం కూల్చివేత



నేలమట్టమైన భవనం

కృష్ణ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎత్తిపోతల పథకానికి సంబంధించిన విశ్రాంతి భవనం ఎక్స్‌కవేటర్ ద్వారా కూల్చివేసిన ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని గుడెబాలురు శివారులో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. 40 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం నది ఒడ్డున లక్ష్మీవెంకటేశ్వర ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టింది. అక్కడి నుంచి రెండో ఎత్తిపోతల పథకం ద్వారా కున్సి, హిందూపూర్, గుడెబల్లూరు ఇతర గ్రామాల రైతులు భూములకు సాగునీరు అందించేందుకు ఎత్తిపోతల పథకం నిర్మాణం చేసింది. పక్కన ఉన్న పొలం నుంచి 20 గుంటల భూమి కొనుగోలు చేసింది. అక్కడే లస్కర్ లు నివాసం ఉండేందుకు భవనం నిర్మించింది. కాలక్రమేణా అది మూతపడింది. దీంతో అప్పటికే భవనంలో కిటికీలు, తలుపులు ఇతర పరికరాలు దొంగలు పడి ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. తన పొలం పక్కన ఉన్న రైతు భవనాన్ని ఎక్స్‌కవేటర్ ద్వారా కూల్చివేశాడు. సమాచారం అందుకున్న రైతులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఏఎస్ఐ సురేంద్రబాబు ఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రాజ్యాధికారమే బీసీల ఎజెండా

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



ఐక్యత చాటుతున్న బీసీ నాయకులు

పాలమూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు రాజ్యాధికారమే సింగిల్ ఎజెండాగా పనిచేయాలని బీసీ ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో తెలంగాణ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్, ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. పార్టీలు, కులాలు, రాజకీయాలకు అతీతంగా బీసీలు సంఘటితమై మన ఓటు మనకే వేసుకని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌పై ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావటంపై హర్షం వ్యక్తం చేశారు. కానీ చట్టబద్ధత కల్పించే శాశ్వత పరిష్కారం చూపకపోతే నిరుపయోగం అవుతుందన్నారు. 42శాతం రిజర్వేషన్ ఆర్డినెన్స్ ప్రభుత్వం తీసుకురావటం ఆలస్యమైతే అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 42శాతం సీట్లు కేటాయించి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు బెక్కెం జనార్దన్, శివరాజు, గోపాల్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు బ్రహ్మయ్య, మహిళా అధ్యక్షురాలు వసంత, రాఘవేందర్‌రాజు, పురుషోత్తం, బీజేపీ నాయకులు కొండయ్య, బీసీ నాయకులు సారంగి లక్ష్మీకాంత్, బుగ్గన్న, నాయీబ్రాహ్మణ యాదగిరి, కుర్మయ్యగౌడ్, రాజకుమార్, రంగినేని, మన్మోహన్, మాధవీలత పాల్గొన్నారు.

రాజ్యాంగంకంటే కులానికే ప్రాధాన్యం

- కేఏఎన్‌పీఎస్ రాష్ట్ర మహా సభల్లో ప్రొఫెసర్ కేవై రత్నం



కేఏఎన్‌పీఎస్ రాష్ట్ర మహాసభలో పుస్తకావిష్కరణ చేస్తున్న వక్తలు

పాలమూరు,జూలై13(ఆంధ్రజ్యోతి): భారత దేశంలో రాజ్యాంగంకంటే కులానికే అధిక ప్రాధాన్యం ఉందని ప్రొఫెసర్ కేవై రత్నం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ భవనంలో ఏర్పాటు చేసిన కేఏఎన్‌పీఎస్(కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి) రాష్ట్ర రెండో మహాసభలను నిర్వహించారు. ఆల్ ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.చక్రవర్తిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం - కుల నిర్మూలనపై కేవై రత్నం మాట్లాడుతూ రాజ్యాంగంలో కుల నిర్మూలన కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడం లేదన్నారు. చట్టం చేయడానికి పోరాటం, చట్టం అమలు చేయడానికీ పోరాటం చేయవలసి వస్తోందన్నారు. ఈ దేశంలో కులనిర్మూలన జరిగి సమసమాజం ఏర్పాటు కావాలంటే విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ప్రొఫెసర్ కే లక్ష్మీనారాయణ అన్నారు. అనంతరం సావిత్రిబాయిఫూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గన్నారపు సరోజన, రిటైర్డ్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు, ప్రొఫెసర్స్ ఎస్.అంజయ్య, సామాజిక కార్యకర్త సూరిశెట్టి సుధాకర్, డాక్టర్ దోమటి జ్యోతి, పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి, టీఎఫ్‌టీయూ ఎస్ఎం ఖలీల్, ఇంద్రవెల్లి రమేష్ తదితరులు ప్రసంగించారు. అనంతరం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా గన్నారపు సరోజన, ప్రధాన కార్యదర్శిగా ఈరపాగ గోవిందు, కోశాధికారిగా ఎర్ర మోహనకృష్ణ, 8 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

అన్నా.. నన్నెందుకు చంపుతున్నారు?

- హత్య సమయంలో తేజేశ్వర్ చివరి మాటలకు లొంగని కసాయిలు
- డ్రైవర్ సీటులో ఉన్న వ్యక్తే తేజేశ్వర్ గొంతుకోసి చంపాడు
- వాయిస్ చేంజర్ డివైజ్‌తోనే తేజేశ్వర్ కుటుంబ సభ్యులను మోసగించిన వైనం
- మిస్సింగ్‌కు 4 రోజుల ముందే హత్యాయత్నం తప్పించుకున్న తేజేశ్వర్
- విలేకర్లతో వెల్లడించిన ఇన్వెస్టిగేషన్ అధికారి టంగుటూరి శ్రీను

గద్వాల క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): "అన్నా.... నన్నెందుకు చంపుతున్నారు? నేను చేసిన నేరమేమి" అని అంటున్నా కూడా వినకుండా కసాయిలు ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ గొంతుకోసి కర్కషంగా హత్యచేసినట్లు ఇన్వెస్టిగేషన్ అధికారి టంగుటూరి శ్రీను వెల్లడించిన వివరాల ద్వారా తెలుస్తున్నది. ఆదివారం ఆయన తన ఛాంబర్‌లో విలేకర్లకు సర్వేయర్ తేజేశ్వర్ హత్యకు సంబంధించి పలు విషయాలను వెల్లడించారు. అయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం కల్గించిన తేజేశ్వర్ హత్యకేసులో ప్రధాన సూత్రధారి తిరుమల్ రావుతో పాటు అతని ప్రియురాలు అయిన తేజేశ్వర్ భార్య ఐశ్వర్య కీలక పాత్ర పోషించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అయితే వాయిస్ చేంజర్ డివైజ్‌తో తేజేశ్వర్ విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునే తిరుమల్‌రావు సుపారి గ్యాంగ్‌ను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేవారు. ఇంటిలో నుంచి బయటకు వచ్చేటప్పుడే తేజేశ్వర్ పూర్తి సమాచారాన్ని ఐశ్వర్యతో ఆమె ప్రియుడు తిరుమల్‌రావుకు వెల్లడించగా అతను ఆ విషయాలను అతని డ్రైవర్ నాగేశ్‌తో పాటు సుపారి గ్యాంగ్‌కు సంబంధించిన పరుశరామ్, రాజులకు వెల్లడించేవారు. హత్యకు సంబంధించిన ప్రణాళికను తయారు చేసుకునే వారు. అయితే గత నెల 17న మిస్సింగ్ అయిన రోజు కంటే ముందే (అంటే 13వ తేదీన) ఒకసారి తేజేశ్వర్ హత్యకు సంబంధించి అన్ని ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. అయితే తేజేశ్వర్‌తో పాటు కిషోర్ అనే వ్యక్తి బైక్‌పై ఉండటంతో ఆరోజు హత్యనుంచి తప్పించుకున్నాడు. లేదంటే అదేరోజు పట్టణ సమీపంలోని సంగాల పార్కు వద్ద తేజేశ్వర్ హత్యకు గురయ్యేవాడు. హత్య కంటే ముందే డ్రైవర్ నాగేష్‌తో పాటు సుపారి గ్యాంగ్ ముఠా సభ్యులు సర్వేయర్ తేజేశ్వర్‌తో పరిచయం ఏర్పాటు చేసుకోవడంతో పాటు కొన్ని సందర్భాలలో అందరు కలిసి మద్యం సేవించినట్లు కూడా తమ దర్యాప్తులో తేలింది.



హతుడు తేజేశ్వర్‌తో నిందితురాలు ఐశ్వర్య పెళ్లినాటి ఫొటో(ఫైల్)

తేజేశ్వర్ చివరి మాటలు...

అయితే గత నెల 17న తేజేశ్వర్ ఇంటినుంచి బయటకు వచ్చి తన బైక్‌ను కిష్టారెడ్డి బంగ్లా సమీపంలో ఆపాడు. సుపారి గ్యాంగ్‌తో పాటు డ్రైవర్ నాగేశ్ తేజేశ్వర్‌ను కారులో ఎక్కించుకొని ముందుసీట్లో కూర్చోపెట్టారు. అయితే గద్వాల పట్టణం దాటి వీరాపురం సమీపంలో ఉన్న కృష్ణస్వామి దేవాలయం రాగానే డ్రైవర్ సీట్లో ఉన్న నాగేశ్ వెంటనే కత్తితో తేజేశ్వర్‌ను చంపేందుకు ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన తేజేశ్వర్ ఆ కత్తితోనే నాగేశ్ చేతికి గాయమయ్యేలా చేశాడు. అయితే అప్పుడే నన్నెందుకు మీరు చంపుతున్నారు.. నేను చేసిన తప్పు ఏమిటి అని చెబుతున్నా వారు వినిపించుకోలేదు. ఇలా తేజేశ్వర్ అంటున్నప్పుడే వెనుక సీట్లో ఉన్న రాజు, పరశురామ్‌లు ముందు సీటు పక్కన ఉన్న బటన్‌ను నొక్కాడు. వెంటనే తేజేశ్వర్ ఉన్న సీటు కొద్దిగా వెనుకకు వచ్చింది. అప్పుడే డ్రైవర్ నాగేశ్ కారును నిలిపివేసి తన చేతిలో ఉన్న కత్తితో తేజేశ్వర్ గొంతుకోశాడు. ఈ సంఘటనలో తేజేశ్వర్ గింజులాడుతున్న సమయంలో వెనక్కులాగి వారిద్దరి కాళ్లకింద వేసుకున్నారు. కాళ్లు, చేతులు గట్టిగా పట్టుకోవడంతో చివరకు ఆ కసాయిల కాళ్లకిందే తేజేశ్వర్ ప్రాణాలు వదిలినట్లు ఇన్వెస్టిగేషన్ అధికారి టంగుటూరి శ్రీను వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఈ హత్యలో ఇంకా ఎవరెవరు ఉన్నారు? వీరికి డబ్బులు ఎవరు ఇచ్చారు? ఎంత డబ్బులు చేతులు మారాయి? ఇంకా ఇందులో ఎవరైనా ప్రముఖులు ఉన్నారా... అనే విషయాలు మరో రెండు రోజుల్లో బయటకు రానున్నాయని సీఐ వివరించారు. మళ్లీ కోర్టు అనుమతితో హత్యలో కీలకపాత్ర పోషించిన తిరుమల్‌రావు, ఐశ్వర్యను కస్టడీలోకి తీసుకొని విచారించి అన్ని విషయాలను వెల్లడిస్తామన్నారు.

విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాగరాజు



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

మిడ్జిల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : దేశంలో విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఎంతైన ఉందని, ఇక్కడ సరిపడా సీట్లు, విద్యావ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నేడు విద్యార్థులు ఇతర దేశాల్లో విద్యనభ్యసించాల్సిన పరిస్థితి నెలకొందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.నాగరాజు అన్నారు. ఆదివారం మండలంలోని వాడియాల స్టేజి వద్ద టీఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఐద్వా మాజీ అధ్యక్షురాలు కామ్రేడ్ అరుణ వర్ధంతి సందర్భంగా సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గీత, సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, సీపీఎం నాయకులు రాంరెడ్డి, కిల్లె గోపాల్‌తో పాటు పలువురు నాయకులు హాజరై అరుణ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యరంగాన్ని కార్పొరేట్‌కు అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలోని చాలా వరకు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. దీంతో పాటు విద్యావ్యస్థను పటిష్టపరిచే విధానంతో పాటు అసమానతల గురించి వివరించారు.

మండలంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదుతో పాటు సన్మాన కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు రాములు, రేణుక, సృజన్‌చక్రవర్తి, డాక్టర్ సుదీప్తి ఏర్పాటు చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కురుమూర్తి, అడ్డాకుల ఎంఈవో కురుమయ్య, వ్యకాస నాయకుడు మోహన్, కేవీపీఎస్ నాయకులుకు రుమయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భరత్, యూటీఎఫ్ జిల్లా నాయకుడు నర్సింములు, హెచ్ఎం తారాసింగ్, ఉపాధ్యాయుడు నర్సింహ్మాస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి పాల్గొన్నారు.

చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా మత్స్యకార సహకార సొసైటీ ఉపాధ్యక్షుడు తుమ్మల అల్లోజీ
- ఖానాపూర్‌లోని చేప విత్తనాల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించిన జిల్లా మత్స్యకార సొసైటీ సభ్యులు



మత్స్యకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా మత్స్యకార సహకార సొసైటీ ఉపాధ్యక్షుడు తుమ్మల అల్లోజీ

బిజినేపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు అందుబాటులో ఉన్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లాభపడాలని జిల్లా మత్స్యకార సహకార సొసైటీ ఉపాధ్యక్షుడు తుమ్మల అల్లోజీ అన్నారు. మండలంలోని ఖానాపూర్‌లోని టైనీ ఫిన్స్ ఫిషరీస్ చేప విత్తనాల ఉత్పత్తి కేంద్రాన్ని జిల్లాలోని అయా గ్రామాల మత్స్యకార సహకార సొసైటీల సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించి పరిశీలించి మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో చేప విత్తన ఉత్పత్తి కేంద్రాల్లో టెక్నీషియన్‌గా పదేళ్ల అనుభవంతో నిర్వాహకులు ఇక్కడ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసి నాణ్యమైన చేప పిల్లల ఉత్పత్తి చేపట్టడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉప్పు నీటిలో ఉత్పిత్తి చేసే చేప విత్తనాలను వ్యయప్రయాసాలకు ఓర్చి తెచ్చి చెరువుల్లో వదిలితే అవి సరైనా తూకం రాకపోవడంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని అవేదన వ్యక్తం చేశారు.

నిర్వాహకులు స్వరూప్ సింగం శెట్టి, రితేష్ కుమార్ సింగ్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫిషరీస్ సొసైటీ సెక్రటరీ వెంకటస్వామి, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తెప్ప తిరుపతయ్య, మండల అధ్యక్షుడు హరికృష్ణ, గొర్ల శ్రీనివాసులు, తిరుపతయ్య, మిద్దె యాదయ్య, సలేశ్వరం, ఉమ్మడ జిల్లా మాజీ డైరెక్టర్ బొందయ్య, సహదేవుడు, సెదులు, ఈర్ల శ్రీకాంత్, కాళ్ల లింగమయ్య, పిట్టల తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

ఆలోచనలకు ప్రతిబింబం కవితా వ్యాసంగం

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్



కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

గద్వాల టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి ఆలోచనలను ప్రతిబింబింపజేసే శక్తి కవిత్వానికి ఉందని, ఆ దిశగా సాహితీవేత్త జయన్న చేసిన ప్రయత్నం ప్రశంసనీయమని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అన్నారు. కవి, విమర్శకుడు, తెలుగు అధ్యాపకుడు నాయుడుగారి జయన్న రచించిన 'కల్లోల కడలి' కవితా సంకల పుస్తకాన్ని ఆదివారం గద్వాల పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో జిల్లా ప్రభుత్వ పాఠశాలల ఎగ్జామ్స్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రియాజ్ మాట్లాడుతూ కవులు, సాహితీవేత్తలు, రచయితలను ప్రోత్సహించేందుకు గ్రంథాలయాలను వేదికగా వినియోగిస్తామన్నారు. పుస్తక సమీక్షను స్థానిక కవి అవనిశ్రీ వీరేష్ కవితలను వివరణాత్మకంగా విశ్లేషించారు. కాగా, జిల్లా గ్రంథాలయంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిండచం అభినందనీయమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు అన్నారు. కార్యక్రమంలో కవులు, సాహితీవేత్తలు ఇక్బాల్ పాషా, మోహన్, నాగేశ్వరాచారి, అంబటి భానుప్రకాష్, మహేందర్, డాక్టర్ మంగళగిరి శ్రీనివాసులు, హరినాగభూషణం, రాముడు, కిశోర్, లైబ్రేరియన్ రామాంజనేయులు ఉన్నారు.

● సమస్యలపై చైర్మన్‌కు మొర : జోగులాంబ గద్వాల జిల్లా గ్రంథాలయంలో నెలకొన్న సమస్యల గురించి పాఠకులు, పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సంస్థ రాష్ట్ర చైర్మన్ రియాజ్ దృష్టికి తెచ్చారు. పుస్తకావిష్కరణకు జిల్లా గ్రంథాలయానికి వచ్చిన చైర్మన్‌ను కలిసిన అభ్యర్థులు సమస్యల పరిష్కారం కోసం గ్రంథాలయ కార్యదర్శికి ఎన్నిసార్లు విన్నివించినా పట్టించుకోలేదన్నారు. ముఖ్యంగా టాయిలెట్ల దుస్థితి గురించి జిల్లా చైర్మన్‌కు, సెక్రటరీకి పలుసార్లు వివరించామని, ఓపిక నశించి ధర్నా కూడా చేశామని రాష్ట్ర చైర్మన్ దృష్టికి తెచ్చారు.

దీనిపై స్పందించిన రాష్ట్ర చైర్మన్ రియాజ్ నూతన భవన నిర్మాణం కోసం అవసరమైన చర్యలు చేపడతామని పాఠకులు, అభ్యర్థులకు హామీ ఇచ్చారు. అదే సమయంలో స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారంపై తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా చైర్మన్ నీలి శ్రీనివాసులుకు సూచించారు.

నల్లమలలో కొనసాగిన పర్యాటకుల రద్దీ

- చెక్‌పోస్టుల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

మన్ననూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అభయారణ్య ప్రాంతంలో ఆదివారం పర్యాటకుల రద్దీ కొనసాగింది. శ్రీశైలం ప్రాజెక్టులో కృష్ణమ్మ అందాలు తిలకించాలనే ఆత్రతతో హైదరాబాద్‌తో పాటుగా ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు ఆదివారం భారీగా శ్రీశైలం తరలివెళ్లారు. మన్ననూరు అటవీ చెక్‌పోస్టు నుంచి కుంచోని మూల వరకు ఉదయం 5 కిలో మీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడే నిల్చుని ఉండటంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఆదివారం 4500 పైచిలుకు వాహనాలు శ్రీశైలం తలివెళ్లాయని మన్ననూరు దుర్వాసుల చెరువు టోల్ గేట్ కేంద్రం నిర్వాహకులు తెలిపారు. పర్యాటకుల రద్దీ కారణంగా మన్ననూరు, వటవర్లపల్లి, దోమలపెంట గ్రామాల్లోని పర్యాటకులతో కాటేజీలు నిండిపోగా, ఇదే అదునుగా నిర్వాహకులు భారీగా రుసుములు వసూలు చేశారు. రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలు, ఇతర చిరు వ్యాపారులకు వ్యాపారం బాగా సాగింది.

పోలీసులు రహదారిపై పెట్రోలింగ్ నిర్వహించగా, రాత్రి వేళల్లో అటవీ అధికారులు సైతం అడవి మార్గంలో పెట్రోలింగ్ నిర్వహించారు.

నిబంధనలు అతిక్రమించి మద్యం సేవించడం, ప్లాస్టిక్ వ్యర్థాలను అడవిలో పారేయడం, అడవిలో వాహనాలు నిలబెట్టడం వంటి చర్యలకు పూనుకున్న వారికి జరిమానాలు విధించి కఠినంగా వ్యవహరిస్తున్నారు.

కల్వకోల్‌లో వ్యక్తి దారుణ హత్య

- రెండు రోజుల తర్వాత వెలుగు చూసిన ఉదంతం
- వివాహేతర సంబంధమే కారణమని చర్చ



దామోదర్‌గౌడ్ (ఫైల్)

పెద్దకొత్తపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఓ మహిళతో ఉన్న వివాహేతర సంబంధమే ఆ వ్యక్తి నిండు ప్రాణం బలి తీసుకుంది. ఈ సంఘటన సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి... పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామానికి చెందిన కర్నాటి దామోదర్‌గౌడ్ (48) అనే వ్యక్తి రెండు రోజుల నుంచి కన్పించడం లేదని భార్య కర్నాటి నిర్మల ఆదివారం పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్ తెలిపారు. దామోదర్‌గౌడ్ ఆచూకీ కోసం గాలిస్తుండగా సింగోటం రిజర్వాయర్‌లో ఒంటిపై పలు గాయాలతో అనుమానాస్పద స్థితిలో మృతదేహం కన్పించిద న్నారు. శవాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆసుపత్రికి పోలీసులు తరలించారు. దామోదర్‌గౌడ్ మరణంపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతికి గల కారణాలు గురించి విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

ఇదిలా ఉండగా దామోదర్‌గౌడ్ మరణంపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఆ గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. దామోదర్‌గౌడ్ కొంత కాలంగా అదే గ్రామంలో ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ క్రమంలో దామో దర్‌గౌడ్ ఆమె ఇంటికెళ్లడంతో ఆమె నెమ్మదిగా ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. ఇద్దరూ మాట్లాడుకుంటుండగా కొంత సేపటికి నిద్ర నుంచి మేల్కొన్న భర్త, ఆమె కుమారుడు ఇంటిలో నుంచి బయటికి వచ్చి చూసి కోపోద్రిక్తులై మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో సదరు మహిళ తలకు గాయం కాగా దామోదర్‌గౌడ్‌ను విచక్షణారహితంగా చావ బాదడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. దీంతో శవాన్ని సంచిలో మూట కట్టుకుని అదే రాత్రి కొల్లాపూర్ మండలం కుడికిళ్ల, తిర్నాంపల్లి మధ్య ఉధృతంగా పారుతున్న ఎంజీకేఎల్ఐ కెనాల్‌లో నిందితులు పడేశారు. ఫిర్యాదు అందుకున్న కొల్లాపూర్ సీఐ మహేశ్, ఎస్ఐ సతీశ్ కేసు దర్యాప్తులో భాగంగా అనుమానితులను అదుపులోకి తీసుకున్నారని సమాచారం. వారు చెప్పిన సమాచారం మేరకు దర్యాప్తులో భాగంగా పోలీసులు కుడికిళ్ల సమీపంలో కృష్ణానది నీటితో నిండుగా ప్రవహిస్తున్న ఎంజీకేఎల్ఐ కెనాల్‌లో దామోదర్‌గౌడ్ మృతదేహాన్ని సంచిలో మూట కట్టి పడేసిన ప్రదేశాన్ని పోలీసులు పరిశీలించారు. కెనాల్ గట్టుపైన పడిన రక్తం మరకలను బురదతో చెరిపేసిన ఆనవాళ్లను పోలీసులు గుర్తించారని తెలిసింది. కెనాల్ నీటి ప్రవాహంలో శవం కొట్టుకుపోయి సింగోటం రిజర్వాయర్‌లో లభ్యమైంది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సతీశ్ తెలిపారు.

జూరాల ప్రాజెక్టుపై ట్రాఫిక్ జామ్

- పర్యాటకులతో కిక్కిరిసిన దారులు
- కిలో మీటర్ల మేర నిలిచిన వాహనాలు



బ్రిడ్జిపై ట్రాఫిక్ జామ్ కావడంతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

అమరచింత, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జూరాల ప్రాజెక్టుపై పర్యాటకుల తాకిడి ఆదివారం ఒక్కసారిగా పెరిగిపోవడంతో ప్రాజెక్టు ప్రధాన రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. ఎగువ నుంచి జూరాల ప్రాజెక్టు అధికారులు 7 గేట్లు ఎత్తి దిగువకు నీరు వదులుతున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి సైతం పర్యాటకులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక వాహనాలతో రావడంతో జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ పుష్కరఘాట్ నందిమల్ల చౌరస్తా ప్రాంతంలో వాహనాలు బారులు తీరాయి. ప్రధాన ఎడమ కాలువ పక్కనే చేపల షెడ్లు ఉండటంతో పెద్ద సంఖ్యలో పర్యాటకులు చేపల రుచి చూడడానికి తరలి వచ్చారు. ప్రాజెక్టు పర్యాటకుల తాకిడితో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోవడంతో గద్వాల ఆత్మకూరు వైపు వెళ్లే వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి. ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సులు సైతం నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాజెక్టుపై వాహనాల రద్దీతో అటు ప్రయాణికులు పర్యాటకులు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



జూరాల ప్రాజెక్టుపై భారీ వాహనాల రాకతో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

క్రైం కార్నర్

కల్లు దుకాణాలపై దాడులు


కల్లు శ్యాంపిళ్లను సేకరిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

నారాయణపేటటౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట ఎక్సైజ్ పరిధిలోని 12 గ్రామాలలోని కల్లు దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు సీఐ అనంతయ్య ఆదివారం తెలిపారు. నారాయణపేట, ఎల్లాస్పూర్, జలాల్‌పూర్, భైరవకొండ, తిప్రస్‌పల్లి, మల్లేపల్లి, పెద్ద జట్రం, సంగంబండ, కాచ్వార్, ధన్వాడ గ్రామాల్లో కల్లు దుకాణాలపై దాడి చేసి శాంపిళ్లను సేకరించి కేసులు నమోదు చేశారు. అదేవిధంగా సారా తయారు చేస్తున్నారన్నా సమచారంతో బుడ్డగాని తండాకు చెందిన బుజ్జమ్మ, తిమ్మాజిరెడ్డిపల్లికి చెందిన శాంతమ్మ, మంగమ్మ, అనంతమ్మలపై కేసులు నమోదు చేసి వారి వద్ద ఉన్న 11 గ్రాముల సారా, కేజీ నవసాగరం స్వాధీనం చేసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఊట్కూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం రాత్రి మండలంలోని తిప్రస్‌పల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని తిప్రస్‌పల్లి శివారు నుంచి అదే గ్రామానికి చెందిన గున్మకుల హన్మంతు తన ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా పెట్రోలింగ్‌కు వెళ్లి పోలీసులు ఆపి తనిఖీ చేపటి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నవాబ్‌పేట మండలంలో ఇసుక టిప్పర్..

నవాబ్‌పేట (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ఆదివారం తెల్లవారుజామున పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఫతేపూర్ మైసమ్మ ఆలయం వద్ద విధుల్లో ఉన్న సమయంలో నవాబ్‌పేట నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న టిప్పర్‌ను ఆపి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

నవాబ్‌పేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : భర్త చనిపోయాడనే బెంగతో బాధపడుతూ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఓ మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాయపల్లి గ్రామానికి చెందిన అరుణ (28) భర్త యాదయ్య కొంతకాలం క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి భర్త మరణం భరించలేని అరుణ మదనపడుతూ ఉండేది. ఆదివారం ఉదయం ఫ్యాన్‌కు ఉరేఉకొని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి ఆంజనేయులు పిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపల గుంతలో పడి యువకుడి మృతి

నవాబ్‌పేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో నుంచి వెళ్లిన ఓ యువకుడు చేపల గుంతలో పడి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కొల్లూర్ గ్రామ పంచాయతీలోని సత్రోనిపల్లి తండాలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రమ్ కథనం ప్రకారం.. కేసవరావుపల్లి దమ్మమ్మతండాకు చెందిన భీమ్లానాయక్, సోనిభాయి దంపతుల కుమారుడు కాట్రవత్ బాలునాయక్ (19) రెండేళ్లుగా అమ్మమ్మ గారి ఊరైన సత్రోనిపల్లితండాలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం బన్ని అనే యువకుడు బావ కనిపించడం లేదని మృతుడి తండ్రికి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. ఇక్కడి రాలేదని చెప్పడంతో చుట్టు పక్కల వెతికినా కనిపించకపోవడంతో తండా సమీపంలో చేపల గుంత వద్ద చెప్పులు కనిపించాయి. గుంతలో చూడగా శవం దొరికింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యవసాయ మోటార్ల చోరీ

మిడ్జిల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కేఎల్ఐ కాల్వ, వాడియాల గ్రామ శివారులోని కేఎల్ఐ కాల్వ పరిసర ప్రాంతంలో కేబుల్ వైర్లు, మోటార్లు గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు రైతులు శ్రీను, జహీర్ ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి శ్రీనుతో పాటు పలువురి రైతులకు సంబంధించిన వైర్లు, మోటార్లు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదం

» రూ.కోటి ఆస్తినష్టం


మంటలు ఆర్పివేస్తున్న ఫైర్ సిబ్బంది

మక్తల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ సమీపంలోని చందాపూర్‌రోడ్‌లో ఉన్న 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని రూ.కోటి ఆస్తినష్టం వాటిల్లిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. విద్యుత్ ఉపకేంద్రంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించామని ఏఈ రామకృష్ణ పేర్కొన్నారు. అప్పటికే విద్యుత్ సామగ్రి మంటల్లో కాలి పోయినట్లు తెలిపారు. దీంతో ఉపకేంద్రం పరిధిలోని సంగంబండ, చందాపూర్, ఖానాపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆరుగంటల తర్వాత పునరుద్ధరించారు.

హుండీ లెక్కింపు

వంగూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీ గెల్వాలంబ ఆలయంలో ఆదివారం హుండీని లెక్కించారు. ఆదాయం రూ.81,500 వచ్చినట్లు చైర్మన్ శేఖర్ తెలిపారు. ఆగస్టు 13 నుంచి అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని టికెట్లకు, కొబ్బరికాయలకు వేలం నిర్వహించగా టికెట్లకు రూ. 1.71 లక్షలు, కొబ్బరికాయలకు రూ. 66 వేలు, లడ్డు వేలానికి రూ.30,500 ఆదాయం వచ్చినట్లు శేఖర్ తెలిపారు

తప్పెవరిది?

» తప్పుడు సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారని పలువురిపై ఫిర్యాదు
» 12 మందిని ఉద్యోగాల నుంచి తొలగించిన పాఠశాల విద్యాశాఖ
» కోర్టును ఆశ్రయించడంతో ముగ్గురికి అనుకూలంగా తీర్పు
» నేటికీ వారిని విధుల్లోకి తీసుకోని వైనం
» విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న బాధితులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తప్పుడుధ్రువపత్రాలు పెట్టి ఉద్యోగాలు పొందారన్న ఫిర్యాదులతో పలువురిపై విచారణ చేసి, ఉమ్మడి పాలమూరుతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పలువురిని ఉపాధ్యాయ ఉద్యోగం నుంచి తొలగించారు. కొందరి ఇక్రిమెంట్ కట్ చేశారు. దీంతో పలువురి ఉద్యోగుల జీవితాలు రోడ్డున పడ్డాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2000, 2001, 2002, 2004, 2006 సంవత్సరాల్లో వరుస ఉపాధ్యాయ నియకాలు నిర్వహించారు. అప్పట్లో వారికి ఉన్న వైకల్యాన్ని బట్టి మహబూబ్‌నగర్ జిల్లా, హైదరాబాద్ ఈఎన్‌టీ ఆస్పత్రిలో వినికిడి లోపం, చూపు మందగించడం, అంగవైకల్యం ఉందని సర్టిఫికెట్స్ పొందారు. వాటి ద్వారా వికలాంగుల కోటాలో ఉద్యోగాలు సాధించారు. విధుల్లో చేరి, 8 నుంచి 10 ఏళ్ల పాటు కొనసాగారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారిపై కొందరు.. వారు వికలాంగులు కారని, తప్పుడు ధ్రువప్రతాలు పెట్టి ఉద్యోగాలు పొందారని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ విషయమై పలు దినపత్రికల్లో వరుస కథనాలు వచ్చాయి.

దాంతో అధికారులు సుమారు 70 మంది పలు వైకల్య సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందారని విచారణ చేశారు. ఆస్పత్రులలో వారికి ఉన్న వైకల్యానికి సంబంధించి చికిత్స చేయించారు. మొదట సర్టిఫికెట్లలో పేర్కొన్న వైకల్యానికి సంబంధించిన పర్సెంటేజ్ రాకపోవడంతో 12 మందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తూ, పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చింది. దీంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయి. అయితే అందులో ఐదుగురు కోర్టును ఆశ్రయించారు. ఒకరిది పెండింగ్ పెట్టగా, ముగ్గురికి కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని బాధితులు తెలిపారు.



మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ కార్యలయం

కోర్టును ఆశ్రయించిన బాధితులు

తమకు వినికిడి, దృష్టి లోపం ఉందని డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికెట్లతో డీఎస్సీ రాసి ఉద్యోగం సాధించుకుంటే కొందరు అవి తప్పుడు ధ్రువపత్రాలని ఫిర్యాదు చేశారని, దాంతో తమను మళ్లీ ఆస్పత్రికి పంపించి వైద్య పరీక్షలు చేయించారని బాధితులు చెబుతున్నారు. అందులో వినికిడి, దృష్టి లోపం పర్సెంటేజ్ తక్కువ రావడంతో తమను పాఠశాల విద్యాశాఖ ఉద్యోగాల నుంచి తొలగించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దీంతో చేయని తప్పుకు తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని, తమకు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించగా, కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చిందని తెలిపారు. కోర్టు తీర్పు కాగితాలను పాఠశాల విద్యాశాఖ అధికారులకు సమర్పించామని, కానీ పాఠశాల విద్యాశాఖ తమ విధుల్లోకి తీసుకోకుండా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని వాపోతున్నారు. అప్పటి నుంచి సగం జీతం మాత్రం ఇస్తున్నట్లు తెలిపారు. దీనిపై కోర్టును మరోమారు ఆశ్రయించామని, అప్పుడు కూడా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. ఆ తీర్పులో బాధితులు తప్పు చేసినట్లు ఎలా అవుతుందని?, వారు నకిలీ సర్టిఫికెట్స్ తయారు చేయలేదు కదా?.. అవి డాక్టర్స్ ఇచ్చిన సర్టిఫెట్స్ అయినందున డాక్టర్లు కూడా తప్పు చేసి ఉండొచ్చుకదా అని తీర్పులో పేర్కొన్నట్లు బాధితులు పేర్కొంటున్నారు.

బాధితులను పట్టించుకోని విద్యాశాఖ

కోర్టు తీర్పు మేరకు తమకు న్యాయం చేయాలని పాఠశాల విద్యాశాఖను బాధితులు కలువగా, జిల్లా అధికారులతో విచారణ చేయాలని చెప్పారు. విద్యా శాఖ అధికారులు సంబంధింత ముగ్గురు బాధితుల ఫైల్‌ను హైదారాబాద్‌లోని కోఠి ఈయన్‌టీ ఆస్పత్రిలో పరిశీలించారు. వారి సర్టిఫికెట్స్ నిజమైనవేనని వైద్యులు అంగీకరించారు. ఈ విచారణ జరిగి రోజులు గడుస్తున్నా బాధితుల సమస్య పరిష్కారం కాకపోవడంతో వారు జిల్లా విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తమకు నాయ్యం చేయ్యాలని కోరుతున్నారు.

డీఈవో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది

రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు సూచించిన ఆదేశాల మేరకు ముగ్గురు బాధితుల సర్టిఫికెట్స్‌ను ఈఎన్‌టీ ఆస్పత్రిలో పరిశీలించారు. అవి నిజమైన సర్టిఫికెట్లేనని తేలింది. అందుకు సంబంధించిన ఫైల్‌ను డీఈవోకు అందించాం. దీనిపై డీఈవో తుది నిర్ణయం తీసుకుంటారు. ఈ విషయమై డీఈవోను వివరణ కోరకు పలుమార్లు ఫోన్ ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

- అనురాధ, ఏడీ, జిల్లా విద్యాశాఖ కార్యాలయం, మహబూబ్‌నగర్ జిల్లా

రాజ్యాంగంపై బీజేపీకి నమ్మకం లేదు

» మాజీ ఎంపీ సుభాషిణి అలీ
» గద్వాలలో ఆవాజ్ కమిటీ ర్యాలీ



గద్వాలలో ఆవాజ్ కమిటీ రాష్ట్ర మహాసభల ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ సుభాషిణి అలీ

గద్వాల టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై బీజేపీకి ఎలాంటి గౌరవం, నమ్మకం లేదని మాజీ ఎంపీ సుభాషిణి అలీ అన్నారు. రాజ్యాంగంలోని లౌకికవాదం, సామ్యవాదం అనే పదాలను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేస్తున్న ప్రయత్నాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఆవాజ్ కమిటీ రాష్ట్రస్థాయి మూడవ మహాసభలు ఆదివారం పట్టణంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ర్యాలీని మాజీ ఎంపీ ప్రారంభించారు. అనంతరం కమిటీ జిల్లా కన్వీనర్ అతిక్‌ఉర్ రెహెమాన్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సుభాషిణి అలీ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోని వచ్చిన అనంతరం దేశంలో మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని, ముఖ్యంగా బీజేపీ పాలిత యూపీ, బీహార్, ఎంపీ రాష్ట్రాల్లో మహిళలపై జరుగుతున్న దాడులు, అరాచకాలకు అంతులేకుండా పోయిందన్నారు. మనువాదం సమాజ పురోగతికి అవరోధమని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఏమాత్రమూ భాగస్వామ్యం లేని బీజేపీకి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూల దిష్టి బొమ్మలను ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో దగ్ధం చేసిన ఆర్ఎస్ఎస్ నాయకులకు రాజ్యాంగపు విలువలపై అవగాహన, నమ్మకం లేకపోవడం విడ్డూరమేమీ కాదన్నారు. బేటీ బచావో అంటూ గంభీర ఉపన్యాసాలు ఇస్తున్న పాలకులు, ఆచరణలో వ్యవహరిస్తున్న తీరుపై ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. బిల్కిస్‌బాను ఉదంతంలో గర్భిణిని మానభంగం చేసిన నిందితులకు క్షమాభిక్ష ప్రసాదించిన బీజేపీ నాయకుల అసలు స్వరూపాలను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్బాస్ మాట్లాడుతూ మైనార్టీలు నేటికీ అన్నింగాల్లో వెనుకబడి ఉండటం శోచనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సరిత మాట్లాడుతూ మైనార్టీల రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వారికి సముచిత స్థానం కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ కట్టుబడి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నీలి శ్రీనివాసులు, ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జబ్బార్, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, న్యాయవాది మధుసూదన్ బాబు, ఆవాజ్ కమిటీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రెహ్మతుల్లా, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు తాహెర్, ఇసాక్, ప్రభాకర్, ఇక్బాల్‌పాషా, కురువ పల్లయ్య, రాజు, వివి నరసింహ, ఉప్పేరు నరసింహ, నర్మద తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర నెట్‌బాల్ జట్ల ఎంపికలు



ఎంపికలో పాల్గొన్న వివిధ జిల్లాల నెట్‌బాల్ క్రీడాకారులతో నెట్‌బాల్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి నెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే మహిళ, పురుషుల జట్ల ఎంపికలను ఆదివారం నగరంలోని స్టేడియంలో నిర్వహించారు. ఈ ఎంపికలను అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యాక్షులు రాంమోహన్, ఖాజాఖాన్, జాయింట్ సెక్రటరీ అంజద్‌అలీ ప్రారంభించి, మాట్లాడారు. జాతీయ స్థాయి నెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశామని, శిక్షణ శిబిరం నిర్వహించి, ప్రతిభ కనబరిన క్రీడాకారులను తుది జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. హర్యానలో ఆగస్టు 28 నుంచి 31వ తేదీ వరకు 4వ ఫాస్ట్ 5 సీనియర్ నేషనల్ టోర్నీతో పాటు 2వ సీనియర్ నేషనల్ మిక్స్‌డ్ నెట్‌బాల్ చాంపియన్ షిప్, జూలై 17 నుంచి 18వ తేదీ వరకు తమిళనాడులో నిర్వహించే 17వ సౌత్‌జోనల్ నెట్‌బాల్ చాంపియన్ షిప్, 18, 19న నిర్వహించే 2వ ఫాస్ట్ 5 సౌత్‌జోన్, 19, 20న నిర్వహించే 1వ సౌత్‌జోన్ నేషనల్ మిక్స్‌డ్ నెట్‌బాల్ చాంపియన్ టోర్నీలో జట్టు పాల్గొంటాయని తెలిపారు. పురుషుల విభాగంలో 94, మహిళల విభాగంలో 64 మొత్తం 158 మంది క్రీడాకారులు ఎంపికలకు హాజరైయ్యారు. కార్యక్రమంలో నెట్‌బాల్ సీనియర్ క్రీడాకారులు అక్రమ్, ముంతాజ్, షరీఫ్ పాల్గొన్నారు.

15, 16వ తేదీల్లో రాష్ట్ర స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలో రాష్ట్ర క్రీడా అకాడమీల్లో 2025-26 సంవత్సరానికి ప్రవేశాలకు ఈనెల 15, 16వ తేదీల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గచ్చిబౌలి, ఎల్‌బీ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన హకీ, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ అకాడమీలో ప్రవేశాలు పొందవచ్చు. 14-16 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న బాల, బాలికలు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 15న గచ్చిబౌలి హకీ, అథ్లెటిక్స్ అకాడమీలో బాల, బాలికల ఎంపికలు ఉంటాయన్నారు. ఈ నెల 16న ఎల్‌బీ స్టేడియంలో హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ బాలుర ఎంపికలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు, జనన ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, క్రీడా ధ్రువ పత్రాలు, 10 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఆయా అకాడమీలో ఎంపికల తేదీల్లో ఉదయం 7 గంటలకు హాజరుకావాలని కోరారు. మరింత సమాచారం కోసం జిల్లా క్రీడాశాఖ కార్యాలయాన్ని సంప్రందించి వివరాలు తెలుసుకోవాలన్నారు.

సాయం చేయడం అభినందనీయం

» చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత
» పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్


ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో పూర్వ విద్యార్థులు

కందనూలు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పూర్వ విద్యార్థులు చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు.

ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో అదే పాఠశాలలో 1986వ సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు సమావేశం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పాల్గొని స్నేహితులు ఒకే చోట కలుసుకోవడం వల్ల వారిలో స్నేహభావం మరింతగా పెంపొందుతుందన్నారు. ప్రతీ ఒక్కరికి విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఆ దశను మళ్లీ నెమరువేసుకోవడానికి స్నేహితులు ఇలా ఒక చోట కలుసుకోవడం వల్ల బాల్యం గుర్తుకు వస్తుందని అన్నారు. చదువుకున్న పాఠశాలకు తమకు తోచిన సహాయం అందించినందుకు ఆయన అభినందించారు. పూర్వ విద్యార్థులు ఆర్వోప్లాంట్ నిర్వహణ కోసం రూ.20వేల ఆర్థిక సాయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందించారు. గగ్గలపల్లి జడ్పీహెచ్ పాఠశాలకు రెండు క్రికెట్ కిట్లు అందజేశారు. భవిష్యత్తులో అందరం ఒకేచోట కలుసుకునేలా కార్యక్రమాలను నిర్వహిస్తామని పూర్వ విద్యార్థులు అన్నారు.

జిల్లా స్థాయి సైక్లింగ్ క్రీడా ఎంపికలు


సైక్లింగ్ క్రీడలు ప్రారంభిస్తున్న ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి

మక్తల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఉమ్మడి జిల్లాస్థాయి రోడ్ స్పీడ్ సైక్లింగ్ ఎంపికలను ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులను ఈనెలాఖరులో హైదరాబాద్‌లో జరిగే సౌత్‌జోన్ పోటీలకు పంపిస్తామన్నారు. 130 మంది బాలికలు, మహిళలు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో థాన్‌సింగ్, బీ.రూప, అంబ్రేష్, దామోదర్, రాఘవేందర్, రాకేష్, సౌమ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను తక్షణమే ప్రకటించాలి

» తపస్ జిల్లా అధ్యక్షుడు దెంది రాజారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తపస్ జిల్లా అధ్యక్షుడు దెంది రాజారెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే ప్రకటించి నూతన పీఆర్‌ఎస్ అమలు చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు దెంది రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో తపస్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనుపాటి మల్లికార్జున్ హాజరై విద్యారంగ సమస్యలు, ప్రమోషన్లు, ఏకీకృత సర్వీసు, సంఘం కార్యక్రమాలు, జాతీయ భావజాలం, విద్యార్థుల్లో దేశభక్తి నిర్మాణం, సభ్యత్వ అభియాన్ వంటి అంశాలపై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయలు కల్పించి విద్యారంగాన్ని బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వెంకట్‌రెడ్డి, సురేష్, రాష్ట్ర కార్యదర్శి శారద, జిల్లా ప్రధాన కార్యదర్శి మనమోని శేఖర్, కోశాధికారి ప్రవీణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, వెంకటేష్, జగదీష్, జైపాల్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మా బతుకులు ఈ భూమి పైనే


అటవీ అధికారులతో వాగ్వాదానికి దిగిన చెంచులు

పదర, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మా బతుకులు, జీవనం ఈ పోడు భూములపైనే ఆధారపడి ఉన్నాయని ఆదివాసీ చెంచులు అంటున్నారు. ఆదివారం మండలంలోని కండ్లకుంట, అమ్రాబాద్ మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామాల్లో చెంచులు సాగు చేసుకుంటున్న భూములను అటవీ అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా చెంచులకు, అటవీ అధికారులకు మధ్య కొద్దిపాటి వాగ్వాదం చోటు చేసుకుంది.

సోమవారం ఉదయం ఈ విషయమై పోలీసుల ఆధ్వర్యంలో మళ్లీ మాట్లాడుతామని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వాలు మారితే చెంచులు సాగు చేసుకునే ఈ భూములకు పోడు పట్టాలిస్తారని అంటున్నా పాలకులు కొన్నేళ్లుగా చెంచుల భూముల విషయంలో పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

కల్వకుర్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మార్చాల గ్రామానికి చెందిన అల్లాజమ్మ, చెన్నమ్మలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక బీఆర్ఎస్ నాయకుల ద్వారా సమాచారం అందుకున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం సమకూర్చారు. ఆదివారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు తలసాని కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వట్టెపు బాలయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, మల్లేష్, శ్రీశైలం, మదన్‌మోహన్‌రావు, వెంకటయ్య, డొక్కలింగం, నరేష్‌గౌడ్, సత్యపాల్, గొడుగు శేఖర్, వట్టెపు కిశోర్, తిరుపతయ్య, పెరుమాళ్ల విజయ్, రవి, బాలరాజు, రమేష్, గణేష్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

వెల్దండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న పెద్దాపూర్ గ్రామానికి చెందిన మాడుగుల రంగయ్యకు చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ మంజూరైన రూ.32 వేల చెక్కును కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమళ్ల కృష్ణ అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుందని కృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గుద్దటి లక్ష్మారెడ్డి, నెంటశ్రీను, తిరుపతినాయక్, రాములు, బాలయ్య, కృష్ణయ్య, మాదవులు, విజేందర్‌రెడ్డి, ప్రవీణ్‌నాయక్, సుధాకర్, అనిల్‌ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలో బీసీలకు సముచిత స్థానం

వంగూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ మార్క్‌గా చరిత్రలో నిలిచిపోతుందని కాంగ్రెస్ నాయకుడు కదారి వెంకటయ్య యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు సముచిత స్థానం కల్పించిందన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై బీసీ సమాజమంతా హర్షిస్తూ సంబురాలు చేసుకుంటే బీఆర్ఎస్ నాయకులకు మింగుడుపడడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం 42శాతం రిజర్వేషన్ కల్పించి కాంగ్రెస్ మాట నిలబెట్టుకుందన్నారు.

'బీజేపీ జెండా దిమ్మె పైపును ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి'

చారకొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామంలో బీజేపీ జెండా పైపును ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు హెడ్ కానిస్టేబుల్ తిరుమల్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇలాంటి సంఘటనలు జరగడం దారుణమని, దుండగులను గుర్తించి అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చలమోని కృష్ణ, నాయకులు వెంకట్‌గౌడ్, కన్నా, చంద్రారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, గోలి రాజు, రాములు యాదవ్, శేఖర్‌గౌడ్, శరత్ పాల్గొన్నారు.

దాడికి యత్నించిన వారిని అరెస్టు చేయాలి : ఏఐఎస్ఎఫ్

కందనూలు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఏఐఎస్ఎఫ్ నాయకులపై బీజేపీ, సంఘ్ పరివార్ దాడులను ఖండిస్తున్నామని ఏఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి బలుముల ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగోల్, బండ్లగూడలోని నవచేతన విజ్ఞాన కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ శిక్షణా తరగతుల సందర్భంగా పాలస్తీనా, ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న మారణకాండను ఆపాలని డిమాండ్ చేస్తూ నవచేతన విజ్ఞాన కేంద్రం రోడ్డు ముందు నిరసన కార్యక్రమం చేపడితే బీజేపీ దాని అనుబంధ సంఘమైన బీజేవైఎం దుండగులు దుర్మార్గంగా ఏఐఎస్ఎఫ్ నాయకులను నిరసన చేయనివ్వకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య యుతంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకున్న సంఘ్ పరివార్ దుండగులను అరెస్టు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కీర్తి, సుమన్, సబీనా, మిక్కీరాథోడ్, లక్షపతి, విక్రమ్, సంయుక్త పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

బిజినేపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలెం గ్రామంలో యువజన కాంగ్రెస్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కశిరెడ్డి భరత్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వేపూరి సిద్ధార్థలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దుల శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. రాబోయె స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేందుకు ఇంటింటి ప్రచారం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకు లు గొవిందు రామకృష్ణ, జయకృష్ణ గౌడ్, విశ్వనాథ్, చంద్రశేఖర్, తిరుపతయ్య గౌడ్, భరత్, విష్ణు, అబ్, బాలు ఉన్నారు.

ఆర్థిక సహాయం

చారకొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన అంకిళ్ల మైసమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందింది. విషయం తెలుసుకొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆశాదీప్‌రెడ్డి సమకూర్చిన రూ. 5వేలను ఆదివారం డీసీసీ ప్రధాన కార్యదర్శి పాలది బాలరాజు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. నాయకులు చాంద్‌పాషా, కారి జంగయ్య, అంకిళ్ల వెంకటయ్య, నారయ్య, దయనాథ్, లక్ష్మయ్య, ప్రవీణ్, సంజీవ, గిరివర్ధన్ పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం..

బోర్డులకే పరిమితం



రంగాపూర్‌లో క్రీడా స్థలంలో మొలచిన ముళ్లచెట్లు

- వసతులు కరువు...నిర్వహణ అస్తవ్యస్తం
- క్రీడా ప్రాంగణాల కోసం స్థలాల కేటాయింపు
- రూ. లక్షల ప్రజాధనం వృథా

అచ్చంపేట టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ, పట్టణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం మునిసిపాలిటీతో పాటు మండల పరిధిలోని గ్రామాలలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంగణాల ఏర్పాటుకు మునిసిపాలిటీలో మునిసిపాలిటీ నిధుల నుంచి గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ నిధుల నుంచి రూ.లక్షలు ఖర్చుచేసింది. వీటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు యువత ఆటలు ఆడేందుకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా యువజన, క్రీడల సర్వీసుల శాఖ ద్వారా మండలంలోని గ్రామాల వారీగా కిట్లను గతంలో పంపిణీ చేసింది. క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా మారగా కిట్లు అటకెక్కాయి.

తూతూ మంత్రంగా..

మునిసిపాలిటీ పరిధిలో 20 వార్డులున్నాయి. వాటిలో ఎక్కడా క్రీడాప్రాగంణాల కోసం స్థలాల కేటాయింపు అతంత మాత్రంగానే జరిగాయి. మునిసిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఒక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని 32గ్రామ పంచాయతీలలో కొన్ని గ్రామ పంచాయతీలలో మాత్రం స్థలాలు కేటాయించారు. మరికొన్నింటిలో స్థలాలు దొరకడం లేదనే సాకుతో పాఠశాలలకే క్రీడా ప్రాంగణాల బోర్డును ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. క్రీడా ప్రాంగణానికి గ్రామాలను బట్టి రూ.2.5 లక్షల నుంచి రూ.4లక్షల వరకు నిధులు వెచ్చించారు.

కిట్లు ప్రజాప్రతినిధుల ఇళ్లలోనే....

జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో అందించిన కిట్లు నాటి అధికారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు అప్పగించారు. యువత వినియోగించాల్సిన ఆ కిట్లు కొన్ని గ్రామాల్లో యువతకు ఇవ్వగా మరికొన్ని గ్రామాల్లో ఆ కిట్లు ప్రజాప్రతినిధుల ఇళ్లలోనే మూలుగుతున్నాయి. గ్రామీణ క్రీడాకారులను గుర్తించి అందించాల్సిన కిట్లు ఆ ప్రజా పతినిధుల ఇళ్లలో పనికిరాకుండా ఉండడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని యువత కోరుతుంది.

వినియోగంలోకి తీసుకురావాలి



క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఉపయోగకరంగా ఉన్న దగ్గర ప్రాంగణాలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఈ ప్రభుత్వమైనా గ్రామస్థాయి బీపీఈడీ చేసిన వారిని ఎంపిక చేసి వారి పర్యవేక్షణలో క్రీడాప్రాంగణాలను నడిపించాలి.

- అరవింద్, అచ్చం పేట

కనీస సౌకర్యాలు లేవు



క్రీడా ప్రాంగణాల్లో కనీస సౌకర్యాలు లేవు. వినియోగానికి పనికిరాని స్థలాలను ఎంపిక చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ప్రత్యేక ప్రాంతాల్లో ఆట స్థలాలను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పిస్తే క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుంది.

- శివ, అచ్చం పేట

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


అమ్రాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ ఓబీసీ సెల్ నాయకులు

అమ్రాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్‌లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంపై కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం అమ్రాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాసుమల్ల, వెంకటయ్య, కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు జాల మల్లేష్ యాదవ్, నేతలు తిరుపతయ్య గౌడ్, రఘురామాచారి, అశోక్, సురేష్ గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

సీఎం కృషితోనే 42శాతం రిజర్వేషన్లు

మన్ననూర్ : సోనియాగాంధీ, రాహుల్ గాంధీల సూచనల మేరకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి ఫలితంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని ఉమామహేశ్వర పాలకమండలి డైరెక్టర్ సంభు శోభ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిండాన్ని హర్షిస్తూ బీసీ మహిళా నాయకులతో కలిసి మన్ననూరులో ఆదివారం నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బీసీ రిజర్వేషన్ల అమలును పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ కృషి ఫలితంగా అమలవుతున్న బీసీ రిజర్వేషన్లను తామే చేసినట్టుగా బీఆర్ఎస్ నేత కవిత చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. కాం గ్రెస్ 18 నెలల పాలన లో, 10 ఏళ్లలో ఇవ్వని రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ వంటి మంచి పథకాల అమలుతో పేదలు సంతోషంగా ఉన్నారని అన్నా రు. కార్యక్రమంలో బీసీ మహిళలు పాల్గొన్నారు.

బీసీల హర్షం

ఉప్పునుంతల : స్థానిక సంస్థల ఎన్నిక ల్లో బీసీ కులాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పలువురు నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఆదివారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని పోచమ్మ చౌరస్తాలో తెలంగాణప్రదేశ్, ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశాల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ రాష్ట్ర నాయ కులు పెబ్బేటి నిరంజన్, నాయకులు చంద్ర య్యగౌడ్, తిరుపతయ్యయాదయ్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు నరేష్, భాస్కర్, లింగమయ్య తదితరులు ఉన్నారు.

పేదలకు వెలుగులు ఇవ్వడమే లక్ష్యం


కంటి ఆపరేషన్ చేయించుకున్న వారితో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో నిరుపేదలకు కంటి వెలుగులు కల్పించడం, నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గం చూపించడమే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యమని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. కల్వకుర్తిలో పది రోజుల పాటు నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమన్నారు. కల్వకుర్తి పట్టణంలోని సీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరంలో 6000మంది హాజరు 3000 మందికి కంటి అద్దాలు ఆదివారం నాటికి 153 మందికి విజయవంతంగా కంటి శుక్లాల ఆపరేషన్ చేయించినట్లు పేర్కొన్నారు. ఏడాది కాలంగా నియోజకవర్గంలో వెల్దండ, ఆమనగల్లు, కల్వకుర్తిలో మూడు మెగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించి వేలాది మందికి కంటి అద్దాలు ఇచ్చి, కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. కల్వకుర్తి మెగా వైద్య శిబిరంలో 176 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక కాగా 153 మందికే శస్త్రచికిత్సలు చేయించినట్లు పేర్కొన్నారు. శంకర నేత్రాలయ సహకారం మరువలేనిదని, వారికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, నరేష్‌గౌడ్, యూసుఫ్‌బాబా, శ్రీపతిరాజు, గణేష్, కొండల్, యాదయ్య, శేఖర్, రమేష్‌నాయక్, రాఘవేందర్, శివ, శ్రీను, మల్లేష్, కల్యాణ్, భాస్కర్ ఉన్నారు.

ఈ నెల 17న అచ్చంపేటలో ప్రజా వేదిక

అచ్చంపేట రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : 2024-25సంవత్సరానికిగాను అచ్చంపేట రూరల్ మండలంలో 38 గ్రామపంచాయతీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వివిధ పనులకు రూ.6కోట్ల 37లక్షల 78వేల 739రూపాయలు ఖర్చు చేసినట్లు అడిషనల్ ప్రోగ్రాం అధికారి బి.సుదర్శన్ గౌడ్ తెలిపారు. ఈ ఖర్చులపై 15వ రౌండ్ సామాజిక తనిఖీ బృందం ఈనెల 10నుంచి 15వ తేదీ వరకు గ్రామాల్లో వివిధ పనులపై తనిఖీ నిర్వహించి ఆయా గ్రామాల్లో స్థానికుల సమక్షంలో గ్రామసభలు నిర్వహిస్తారని చివరగా ఈ నెల17న అచ్చంపేట ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో సుదర్శన్‌గౌడ్ తెలిపారు. ఈ ప్రజా వేదికకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి జగన్

చారకొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి జగన్ అన్నారు. ఆదివారం మండలంలోని గోకారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదల సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో పేదలను పట్టించుకోలేదని అన్నారు. రాబోయె స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటడం ఖాయమన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు జంబుల నాగేష్, బొడ్డుపల్లి కొండల్, సిరిగిరి వెంకటయ్య, చిత్తారి ఎల్లయ్య, కొండల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిమ్మాజిపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నేడు తిమ్మాజిపేట మండలంలోని మరికల్, ఇప్పలపల్లి, పుల్లగిరి, గుమ్మకొండ, ఎదిరేపల్లి గ్రామాల్లో ఉదయం 7గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు గమనించాలని విద్యుత్ ఏఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రంలో పాత బ్రేకర్ తీసి కొత్త బ్రేకర్ అమర్చడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని ప్రభుత్వ కార్యాలయాలు వారు బ్యాంకు అధికారులు, ప్రైవేట్ సంస్థల వారు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

పెద్దకొత్తపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ వి.సత్యం వదినమ్మ వనోజ్ కౌసల్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం జరిగిన దశదిన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మేకల చంద్రయ్యయాదవ్, చంద్రబండతండా మాజీ సర్పంచ్ రాంలాల్‌నాయక్, అరవింద్, వెన్నచెర్ల మాజీ ఎంపీటీసీ రవికుమార్, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు మండల సత్యనారా యణ పాల్గొని చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బాల్‌లింగాచారి రాంప్రసాద్, రాజు, ఎం.శంకరయ్య, గంగం సాయి బాబు, శ్రీకృష్ణాచారి ఉన్నారు.

పౌర హక్కుల దినం నిర్వహించాలి

- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో కుల వివక్షత, అంటరానితనం నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం చొరవ తీసుకుని పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికీ చాలా గ్రామాల్లో కుల మతాలకు అతీతంగా జరుపుకునే పీర్ల పండగకు దళితులు అలయ్ ఆడే పరిస్థితి లేదన్నారు. దళిత వాడల్లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సరఫరా సక్రమంగా లేవన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కూడా అర్హులైన దళితులకు రావడం లేదని ఆరోపించారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కలిసి ప్రతీ నెల 30 తారీఖున ప్రతీ గ్రామంలో పౌర హక్కుల దినం నిర్వహించాల్సి ఉన్నా అది ఎక్కడా అమలు కావడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణం పౌర హక్కుల దినాన్ని నిర్వహించడంతో పాటు దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు రామకృష్ణ, అశోక్, సత్యనారాయణ, కృష్ణ, రాజు, శివ, వెంకటయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి


నంది వడ్డెమాన్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

బిజినేపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నియోజక వర్గంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నంది వడ్డెమాన్‌లో ఆదివారం 37 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 30 మందికిపత్రాలు అందజేసి పలువురు లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లు ఇవ్వకుండా పదేళ్ల పాటు మాయమాటలు చెప్పి మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజల అవసరాల అనుగుణంగా పాలన సాగిస్తూ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కతలప్ప, పంచాయతీ కార్యదర్శి లింగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, డీసీసీ ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, రేమొదుల రమేష్, ఆవుల రాములు, వీరశేఖరాచారి, వేమ వెంకట్రాములు, రామకృష్ణ, రామచందర్, జయకృష్ణ, అమృత్ రెడ్డి, రాగి మధుసూదన్ రెడ్డి, నరేందర్ గౌడ్, పండ్ల పాషా, ముక్తార్, భగవంత్ గౌడ్, కత్తె ఈశ్వర్, చెన్నయ్య, ఆయా గ్రామాల మండల నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆరోగ్య భద్రత

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కల్వకుర్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్య భద్రత చేకూరుతుందని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. నిరుపేదలు ఎవరైనా ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటే వారికి ఆర్థికంగా ఇబ్బంది కలుగకుండా సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే తన నివాసంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్న సంకల్పంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహతో వంద పడకల ఆసుపత్రి మంజూరు చేయించి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. నిర్ణీత కాలంలో ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేయించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా చూస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకే అబద్ధాలు

- మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ కుమార్ యాదవ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజీవ్ కుమార్ యాదవ్

కల్వకుర్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ అబద్ధాలు మాట్లాడుతున్నారని మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజీవ్ కుమార్‌యాదవ్ విమర్శించారు. కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఉన్న 50పడకల ఆసుపత్రికి మరో 50 పడ కలు చేర్చి వంద పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలని ఎన్నికల ముందు హడావిడిగా శంకుస్థాపన చేసినా ఎలాంటి టెండరు ప్రక్రియ కాలేదన్నారు. అందుకే వంద పడకల ఆసుపత్రిని ఎమ్మెల్యే మంజూరు చేయించారని అన్నారు. విలేకర్ల సమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ పండిత్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పసుల రమాకాంత్‌రెడ్డి, కొండల్, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

మునిసిపాలిటీ రెవెన్యూ మేళాకు విశేష స్పందన

- మేళా జూలై 17 వరకు పొడిగింపు


నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ రెవెన్యూ మేళాలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 12 వరకు నిర్వహిస్తున్న రెవెన్యూ మేళాకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. వారం రోజుల వ్యవధిలోనే మొత్తం 288 దరఖాస్తులు వచ్చినట్లు మునిసిపల్ అధికారులు తెలిపారు. అందులో 148 దరఖాస్తులు ఇంటి నెంబరు కోసం రాగా స్థిరాస్తి మార్పిడి కోసం 94, పేరు సవరణ కోసం 27, టాక్స్ రివిజన్ కోసం 19 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ దరఖాస్తుల న్నింటినీ ఇప్పటికే పరిశీలించి, వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేశామని మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డి ఆదివారం తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని రెవె న్యూ మేళాను ఈ నెల 17 వరకు పొడిగిం చినట్లు కమిషనర్ తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

న్యాయం జరిగే వరకు దీక్షలు విరమించం

- కొల్లాపూర్‌లో జర్నలిస్టుల వెల్లడి

కొల్లాపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టులందరికీ ప్రభుత్వం నివాసస్థలాలు కేటాయించే వరకు దీక్షలు విరమించేది లేదని టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్కెర రాం చందర్ అన్నారు. టీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు జర్నలిస్టులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 19 రోజుకు చేరాయి. ఈ దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతూ 30 ఏళ్లుగా జర్నలిస్టులుగా పనిచేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్న తమను ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. ఆదివారం రిలే దీక్షలను టీయూడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ, నియోజకవర్గ అధ్యక్షుడు మద్దిలేటి, సీనియర్ జర్నలిస్టులు కుర్మయ్య, మల్లికార్జున్‌సాగర్, పెరు మాళ్ల స్వామి, గోవిందు, రమణ కొనసాగించారు.

బోర్డు ఇక్కడ.. కళాశాల ఎక్కడ ?

- రాంరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిలో ఉన్న బోర్డు



రాంరెడ్డిపల్లి సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న పురుషుల గురుకుల డిగ్రీ అండ్ పీజీ కళాశాల బోర్డు

బిజినేపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : బిజినేపల్లి నుంచి జడ్చర్లకు వెళ్లే ప్రధాన రహదారిలోని రాంరెడ్డిపల్లి గ్రామ సమీపంలో పాలమూర్ యూనివర్సిటీ పరిధిలో పురుషుల గురుకుల డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఉన్నట్లుగా నేమ్ బోర్డు ఉంది. బోర్డుకు కనుచూపుమేరలో అక్కడ ఎలాంటి కళాశాల లేకపోవడం గమనార్హం. బోర్డుపై కళాశాల కోడ్, గురుకులం కోడ్, కళాశాల ప్రారంభం చేసిన సంవత్సరం 2017 వంటి వివరాలు ఉన్నా నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రామం పేరును మాత్రం రంగు వేసి కనబడకుండా చేశారు. నిత్యం రోడ్డు వెంట ప్రయాణిస్తున్న స్థానికులకు ఇక్కడ కళాశాల లేకున్నా బోర్డు రాసి ఇక్కడ ఎందుకు పెట్టారని సందేహం వ్యక్తం చేస్తున్నారు. కళాశాల ఉన్నట్టా? లేనట్టా? అనేది తేల్చింది మాత్రం జిల్లా విద్యాశాఖ అధికారులేనని పలువురు చర్చించుకుంటున్నారు.